అనుభూతుల జాడ.. యారాడ



పిక్నిక్ సీజన్ వస్తే చాలు.. గాజువాక ప్రాంతం సందడిగా మారుతుంది. జనంతో కిక్కిరిసిపోతుంది. వనభోజనాలకు ఈ ప్రాంతం అనువుగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. అందులో ప్రధాన పిక్నిక్ స్పాట్ యారాడ. గాజువాకకు 10 కిలోమీటర్ల దూరంలో సహజ సౌందర్యాల నడుమ పర్యాటకులకు కనువిందు చేస్తుంది. దీంతో ఈ తీరానికి పర్యాటకులు కార్తీకమాసంలో పోటెత్తుతారు.


- అందమైన తీరం
- ప్రకృతి రమణీయత కలబోత
- కార్తీక మాసం కావడంతో వనభోజనాల సందడి

గాజువాక: ఒక పక్క అందమైన సముద్ర తీరం, మరో పక్క చుట్టూ కొండలు, మధ్యలో పచ్చని చెట్లతో పర్యాటలకు స్వాగతం పలికే గ్రామం యారాడ. ఎత్తైన కొండపై నుంచి చూస్తే తప్పా ఇక్కడ ఒక గ్రామం ఉందన్న విషయం ఎవరికీ తెలియదు. సుమారు 130 ఏళ్ల చరిత్ర గల యారాడ గ్రామం సింధియా న్యూకాలనీ సమీపంలోని కొండ దిగువ ప్రాంతంలో ఉంది. షిప్‌యార్డ్ క్వార్టర్ల ప్రహరీకి ఆనుకొని ఉన్న రోడ్డు నుంచి బయలుదేరి ఎనిమిది కిలోమీటర్లు కొండలపై ప్రయాణించి ఈ గ్రామానికి చేరుకోవచ్చు. గాజువాక నుంచి వెళ్లాలనుకునే వారు పెదగంట్యాడ జంక్షన్, గంగవరం మీదుగా చేరుకోవచ్చు.

ఎటు చూసినా కనువిందే

ఎగిసిపడే అలలతో కూడిన సుందర బంగాళఖాతం ఒక వైపు.. డాల్ఫిన్ చేప ఆకారంలో ఎత్తైన కొండలు మరోవైపు. మధ్యలో పచ్చని అరటి, కొబ్బరి చెట్లు ఇలా అనేక అద్భుతాలు యారాడ తీర ప్రాంతంలో కొలువుదీరాయి. ఒక్కసారి ఈ గ్రామాన్ని సందర్శిస్తే ఎప్పటికీ మరవలేని మధురానుభూతి మిగులుతుంది. గ్రామంలో అడుగు పెట్టగానే పురాతన సీతారాముల ఆలయం దర్శనమిస్తుంది. వందల ఎకరాల విస్తీర్ణంలో జీడి, మామిడి, అరటి తోటలు సెలయేటి గాలులకు కదులుతూ సందర్శకులను ఆహ్లాదపరుస్తాయి.





కొండపైనుంచి యారాడ గ్రామం వ్యూ

ఆహ్లాదం పంచేలా..

అందమైన సముద్రతీరం, అగ్రిగోల్డ్ గార్డెన్ పర్యాటకుల మనసును కట్టి పడేస్తుంది. సముద్రతీరంలో అందమైన కొండల రూపం, అగ్రిగోల్డ్ గార్డెన్‌లో చిన్నారులకు, పెద్దలకు ఆట పరికరాలు, వన భోజనానికి అవసరమై విశాల మైదానం, స్విమ్మింగ్ పూల్, పర్యాటకులు సేదతీరేందుకు అందమైన కుటీరాలు ఉన్నాయి. గ్రామం సమీపాన లైట్‌హౌస్, రాడార్ కేంద్రం, నేవల్ అధికారుల కోసం నిర్మించిన అందమైన భవనాలు, భీముని పాదాలు, దర్గా, నూకాలమ్మ ఆలయంతో పాటు అరటి, కొబ్బరి, జీడి తోటలు పర్యాటకులను కట్టి పడేస్తాయి. విశాఖ పారిశ్రామిక ప్రాంతానికి ఎంతో దగ్గరగా ఉన్న యారాడను పరికిస్తే ఓ నూతన ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. రెండు కొండలను దాటుకొని ఈ గ్రామాన్ని చేరుకోవడం కొత్త అనుభూతినిస్తుంది. మొదటి కొండపై నుంచి వెనుదిరిగి చూస్తే షిప్‌యార్డ్ మొదలుకొని నేవల్ డాక్‌యార్డ్, విశాఖపట్నం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కర్మాగారాలు ఒక క్యూలో నిల్చొని ఉన్నట్టు కనిపిస్తాయి. కొద్దిగా ముందుకు వెళ్లి రెండో కొండపై నుంచి చూస్తే చుట్టూ చెట్లు, సముద్రం, యారాడ గ్రామం, పచ్చదనానికి, పారిశ్రామిక ప్రాంత కాలుష్యానికి దూరమైన ఒక స్వచ్ఛమైన వాతావరణం దర్శనమిస్తుంది.

యారాడ చేరుకోండి ఇలా..

యారాడ బీచ్‌కు చేరుకోవడానికి పెదగంట్యాడ మీదుగా మరో అద్భుతమైన రోడ్డు ఉంది. గంగవరం గ్రామం నుంచి యారాడ బీచ్ వరకూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే బీచ్‌ను చేరుకోవచ్చు. ఈ మార్గం ద్వారా వెళ్తుంటే పచ్చటి కొండలతోపాటు విశాఖ ఏజెన్సీలో హొయలొలికించే అందాలు ఇక్కడ కూడా కనిపిస్తాయి. కొండపైకి ఎక్కి చూస్తే గంగవరం పోర్టు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పక్కపక్కనే ఉన్నట్టు కనిపిస్తాయి. కొండ దిగిపోతే అక్కడ రెండుగా విడిపోయి ఉన్న సముద్ర తీర ప్రాంతాలు, తీరానికి ఆనుకొని ఉన్న పచ్చని తోటలు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం అధికారులు ముందుకు రాకపోయినా విశాఖకు వచ్చిన అనేకమంది విదేశీయులు సైతం ఈ ప్రాంతానికి వచ్చి సాగర తీరంలో సేద తీరి వెళ్తుంటారు. యారాడ వెళ్లేందుకు సొంత రవాణా సౌకర్యం లేనివారు ఆర్టీసీ బస్సుల్లో కూడా వెళ్లవచ్చు. గాజువాక డిపో నుంచి 16వ నంబర్ సర్వీసు సింధియా, నేవల్ క్వార్టర్ల మీదుగా వెళ్తుంది.

సీపీఎం పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చేపట్టనున్న పోరుబాట కార్యక్రమం పోస్టర్‌ను ఆ పార్టీ గాజువాక నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ అధిక ధరలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా 14న గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార, చివరకు ఉల్లిపాయల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయన్నారు. నిత్యావసర సరుకులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం నియంత్రణ ఎత్తివేసి బ్లాక్ మార్కెట్లను పెంచే చర్యలు చేపట్టిందని, దీంతో ధరలు అడ్డూ, అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా వీటిని నియంత్రించే చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అధిక ధరలను తగ్గించే వరకూ తమ పోరాటం కొనసాగుతందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.రమణ, బంగారు నాయుడు, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్, కార్పొరేటర్ జగన్

అగనంపూడి: పారిశుధ్య నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి మహా విశాఖను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో నిలపాలని జీవీఎంసీ గాజువాక జోనల్ ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. 87వ వార్డు పారిశుధ్య కార్మికులకు శుక్రవారం రెండు జతల దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పని చేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ వార్డు నుంచి అధిక సంఖ్యలో పారిశుధ్య సిబ్బంది విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలు అందించి వచ్చారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి గొలగాని అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు దుస్తులతోపాటు కుట్టు చార్జీలు, పని ముట్లు, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేష్, భాగ్య, రామారావు, దేవి పాల్గొన్నారు.

జీతాల అంశంపై సీఎం చొరవ చూపాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ వద్ద డబ్బు ఉండి కూడా జీతాలు ఇవ్వడం లేదని, ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ రామెటీరియల్ కొంటున్నాం.. ప్లాంట్ నడుపుతున్నాం అని చెబుతూ కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. ఈ అంశంపై కూటమి పెద్దలు జోక్యం చేసుకుని జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎన్‌డీఏ కూటమి (బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్‌ఈయూ,వీఎస్‌పీఈయూ, వీయూఎస్‌ఎస్) కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సీఎం చంద్రబాబు , కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, విశాఖ ఎంపీ శ్రీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులను ఈ మెయిల్ ద్వారా కోరారు. బ్యాంకు రుణాలు కట్టలేకపోవడం వల్ల డిఫాల్టర్లుగా మారుతున్నారన్నారు. పిల్లల ఫీజులు కట్టలేని పరిస్థితిల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని.. తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు, ఎం. కోటేశ్వరరెడ్డి కోరారు.

గుర్తింపు యూనియన్‌కు సెగ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులకు యువ కార్మికుల సెగ తగిలింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇప్పించడంతో గుర్తింపు యూనియన్ విఫలమైందంటూ వీరు నిరసన చేపట్టారు. యువ కార్మికులు అధ్యక్షుడి పేరిట అమర్ రహే అంటూ చేసిన నినాదాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

అగనంపూడి: అగనంపూడిలో జూదం ఆడుతున్న 9 మందిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.28వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అగనంపూడి రైల్వేట్రాక్‌ను ఆనుకొని నిర్మానుష్య ప్రాంతంలో గురువారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలి



జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణతో చర్చిస్తున్న నాయకులు

అగనంపూడి: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు ఎన్నికలు నిర్వహించాలని జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రవీణను 85వ వార్డు నాయకులు వినతిపత్రంలో కోరారు. 2012 నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదని, దీని వల్ల సొసైటీల్లో సభ్యులు ఎంతమంది ఉన్నారో, ఎవరికి ఓటు హక్కు ఉందో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించి కమిటీలు ఎన్నుకొనే వెసులుబాటు కల్పించాలని ఆమెను కోరారు. జిల్లా సహకార శాఖ అధికారిని కలిసిన వారిలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, బండారు రమేష్ చందు పాల్గొన్నారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



రాజేష్ (ఫైల్)

అగనంపూడి: గుర్తు తెలియని రైలు ఢీకొని వడ్లపూడి నిర్వాసితకాలనీకి చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్లపూడి నిర్వాసిత కాలనీ యాదవ కాలనీకి చెందిన దేవర రాజేష్ (24) విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తూ ఆవులను పెంచుతున్నారు. ఈ క్రమంలో ఒక ఆవు సాయంత్రం దాటినా ఇంటికి చేరకపోవడంతో ఆవును వెదుకుతూ గ్రామంలో తిరిగారు. ఆవుకోసం గాలిస్తున్న సమయంలో గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఎన్టీపీసీ ట్రాక్‌పై రాజేష్ శవమై కనిపించాడు. రాత్రి 12 దాటినా భర్త ఇంటికి చేరకపోవడంతో సుజాత పలుమార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. శుక్రవారం ఉదయం జీఆర్‌పీ పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేసి మీ భర్త ఎన్టీపీసీ ట్రాక్‌పై మృతి చెంది ఉన్నారని తెలపడంతో ఆమె కన్నీటిపర్యంతం అయింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అగనంపూడి: గంజాయి, మత్తుమందు కలిగి ఉన్న ఇద్దరిని విశాఖ నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయితో పాటు అరగ్రాము ఎండీఎంఏ మత్తు మందును స్వాధీనం చేసుకొని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గాజువాక శ్రీనగర్‌కు చెందిన మైసర్ల మధుబాబు, పెందుర్తి ప్రాంతానికి చెందిన గేదెల ఫల్గుణి నర్సింగ్ వర్మ కలిసి ఢిల్లీలో పార్టనర్‌షిప్‌లో హోటల్ ప్రారంభించారు. అక్కడ గంజాయికి అలవాటు పడిన వీరు హోటల్ వ్యాపారాన్ని వదిలి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయానికి వచ్చారు. రాయగడకు చెందిన షేక్ మహబూబా వద్ద నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. రెండు కేజీల గంజాయిని బెంగళూరులో విక్రయించి గోవా వెళ్లారు. అక్కడ ఎండీఎం మత్తుమందు కొనుగోలు చేసి అరగ్రాము మత్తుమందును పీల్చేశారు.

అక్కడి నుంచి ఈనెల 6వ తేదీన రైల్లో బయల్దేరి దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దిగి బయటకు వచ్చే సమయంలో సిటీ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.భాస్కరరావు తన సిబ్బందితో కలిసి దాడిచేసి ఇద్దర్ని అదుపులోకి తీసుకొని రెండు కిలోల గంజాయి, అరగ్రాము మత్తుమందును స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీని సత్కరిస్తున్న సంఘం పెద్దలు

పెదగంట్యాడ: పెదగంట్యాడ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ వాసవీ సంచయతన ఆలయంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కొత్తా సూర్యనారాయణ, కార్యదర్శిగా తీగెల శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగమళ్ల ప్రభోజీతో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.సంఘం పెద్దలు మెగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడి శెట్టి ముత్యాల శెట్టి,కొల్లా అప్పలరాజు, కులుకూరి మంగరాజు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.అనంతరం వారిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తామని, ఆర్యవైశ్యల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి దానప్పతల్లి జాతర

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణతి గ్రామ దేవత దానప్పతల్లి జాతర ఈనెల 16న నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ మేరకు ఉత్సవ వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. అమ్మవారికి ప్రతీకరమైన ముద్రాత, సారె, అన్న సమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు దుగ్గపు వెంకటప్పారావు, బొడ్డ సన్యాసిరావు, వైస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో పిన్నింటి సంతోష్, అప్పిని సన్యాసిరావు, దుగ్గపు నరసింగరావు, ఆడారి శ్రీను, నక్కుల శంకరరావు, బొడ్డ లక్ష్మీనారాయణ, దుగ్గపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రుణ వాయిదాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ రుణ వాయిదాల చెల్లింపు కోసం సొసైటీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని సొసైటీ పాలకవర్గ ప్రతినిధులు తెలిపారు. సొసైటీ నుంచి తీసుకున్న రుణాల రికవరీ ద్వారా వచ్చిన నగదును యాజమాన్యం సొసైటీకు చెల్లించడం లేదన్నారు. ఆ విధంగా రికవరీ చేసిన నగదు ఇప్పటి వరకు రూ.78.57 కోట్లు యాజమాన్యం సొసైటీకు బకాయి పడిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఉద్యోగులు సొసైటీకి వచ్చి చెల్లిస్తే వడ్డీ భారం తగ్గుతుందన్నారు. ఇందులో భాగంగా ఈఎంఐ చెల్లించడానికి సొసైటీ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఎస్‌బీఐ కలెక్ట్ ద్వారా ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా సొసైటీకు చెల్లింపులు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం ప్రతినిధులు కోరారు.

సాంకేతిక నైపుణ్యం పెంపుదల అవసరం



డీఆర్‌డీవోను సందర్శించిన విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

అగనంపూడి: సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడానికి పారిశ్రామిక సందర్శనలు ఎంతో దోహదపడతాయని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. కళాశాలకు చెందిన ఈసీఈ విభాగం విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా శుక్రవారం డీఆర్‌డీవోను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి ఇటు వంటి సదస్సులు, సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఈసీఈ డీన్లు రమేష్‌బాబు, నాగజ్యోతి, రవికుమార్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఫాగింగ్ చేపట్టారు. అక్కిరెడ్డిపాలెం, చిన అక్కిరెడ్డిపాలెం, వివేకానందకాలనీ, పంచవటీ టౌన్ షిప్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు మలేరియా అధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. రోజుల తరబడి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

172 బియ్యం బస్తాల చోరీ



చౌక ధరల డిపోను పరిశీలిస్తున్న పోలీసులు

పెదగంట్యాడ: మండలంలోని నడుపూరులో గల 338 చౌక ధరల డిపోలో బియ్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడుపూరు ప్రాంతం శీరవానిపాలెంలోని రేషన్ డిపోకు గత నెల 22న బియ్యం బస్తాలు వచ్చాయి. ఈ డిపోలో గత నెలలో మిగిలిన 24 బస్తాలతో పాటు కొత్తగా 206 బస్తాలు దించారు. మొత్తం 230 బస్తాలు ఉన్నాయి. లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయడానికి డీలర్ ఈ నెల 5న స్టాక్ ఉంచిన ఇంటికి వెళ్లారు. అయితే ఆ ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించారు. అక్కడ 230 బస్తాల్లో 172 బస్తాలు కనిపించకపోవడంతో వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఆ డిపోను పరిశీలించారు. చోరీ జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానితుల విచారణ

బియ్యం చోరీ విషయమై న్యూపోర్టు పోలీసులు పలువురు అనుమానితులను విచారిస్తున్నారు. అయితే సదరు డిపో డీలర్ వద్ద ఉండే హెల్పర్ సాయి పరారీలో ఉన్నాడు. అతను దొరికితే గానీ అసలు విషయం బయటకు వచ్చేలా లేదు. డిపో ఎదురుగా ఉన్న మసీదుతో పాటు కృష్ణుడి ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అందులో అర్ధరాత్రి 1 గంట తర్వాత వ్యాన్ ద్వారా బస్తాలు తరలించినట్టు గుర్తించారని సమాచారం.

86 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- రెండు వాహనాలు సీజ్
- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

అగనంపూడి: రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లాకు చెందిన భరాటం రమణమూర్తి నెల రోజుల కిందట పెదగంట్యాడ మండలం అయ్యన్నపాలెం వచ్చి నివాసముంటున్నారు.

ఇతను ఇదే మండలం దయాల్‌నగర్‌కు చెందిన బండారు కృష్ణతో కలిసి రేషన్ బియ్యాన్ని కేజీ రూ.15కి కొనుగోలు చేసి సబ్బవరంలోని కోళ్లఫారానికి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇలా రెండు వ్యాన్‌లలో 4,300 కిలోల బియ్యాన్ని 86 బస్తాల్లో ఫకీర్‌తక్యా మీదుగా సబ్బవరానికి రవాణా చేస్తుండగా ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం వాహనాలను అడ్డుకొని తనిఖీ చేశారు. కోటా బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్టు నిర్ధారించుకొని వారిని అరెస్టు చేసి వాహనాలు, బియ్యం బస్తాలను సీజ్ చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టార్గెట్ నంబర్ వన్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ నంబర్ వన్ స్థానం సాధించేలా సిబ్బంది పని చేయాలని సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రజారోగ్య విభాగం మేస్త్రీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాక జోన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూలు చేయడంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఫ్రీ డస్ట్ బిన్ ఏరియాగా వర్కర్స్‌కు ఎప్పటికప్పుడు క్లీనింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి, అప్పారావు

పెదగంట్యాడ: కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయి మంచానికే పరిమితమైన కల్లు గీత కార్మికుడు పీత రమణకు అండగా నిలవాలని యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరుకు చెందిన పీత రమణ ఇటీవల కల్లు గీస్తుండగా చెట్టుపై నుంచి జారి పడిపోయాడు. వెన్నుముక విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యారు. అతని పరిస్థితిని తెలుసుకున్న యాత, శెట్టిబలిజ గౌడ, ఈడిగ శ్రీశైలం సంక్షేమ సంఘం వైస్ చైర్మన్ అండిబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు కలసి శుక్రవారం ఆయన్ను పరామర్శించారు. నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, సన్యాసిరావు, భాస్కరరావు, నాగరాజు, అప్పలరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలోని డివైడర్‌ను ఢీట్టి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు.. గాజువాక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ వై. శ్రీనివాసరావు శుక్రవారం గాజువాక నుంచి దేశపాత్రునిపాలెం బయల్దేరారు. సెక్టార్-10 పెట్రోల్ బంకు దాటిన తర్వాత ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి.అతన్ని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.